بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِیْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْد

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 10.02.2023 (Telugu)**

# హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం విజ్ఞానవంతమైన ఉపదేశముల ఆధారంగా పవిత్ర ఖుర్ఆన్ విశిష్టతలు, స్థాయి అంతస్తు, గొప్పతన వివరణ

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.02.2023 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

గత ఖుత్బాలో నేను పవిత్ర ఖుర్ఆన్ వైభవము, ప్రాముఖ్యత గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశములను ప్రస్తావించి వుంటిని. నేడు దీని గురించి మరికొన్నిటిని ప్రవేశ పెట్టెదను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం రాణి విక్టోరియా వజ్రోత్సము (డైమండ్ జూబ్లి) సందర్భమున రాణికి ఇస్లాం సందేశము అందించుటకు రచించిన తన పుస్తకము 'తుహ్ఫ ఖైసరియా'లో పవిత్ర ఖుర్ఆన్ ప్రాముఖ్యత, శుభముల గురించి ఇట్లు పేర్కొనిరి. పవిత్ర ఖుర్ఆన్ లోతైన వివేకములు కలిగి ఉన్నది. ప్రతి బోధనలో ఇంజీల్ కంటే మెరుగైన స్వచ్ఛమైన పుణ్యమును నేర్పించెను. ప్రత్యేకంగా నిజమైన, మార్పురహిత దేవుణ్ణి తిలకించుటకు దీపము ఖుర్ఆన్ చేతిలోనే ఉన్నది. అది ప్రపంచములో అవతరించని యెడల ప్రపంచములో ఇతర ఆరాధ్య దైవముల సంఖ్య ఎంత పెరిగేదో దేవుణికే తెలుసు. ప్రపంచము నుండి కనుమరుగైన దైవ ఏకత్వము మరల స్థాపించబడినందుకు కృతజ్ఞత తెలుపు కోవలసిన అవసరమున్నది.

హుజూరె అన్వర్ ఇట్లు తెలిపిరి. ఆ కాలములో ఇంతటి ధైర్యముతో భారత మహారాణికి ఇస్లాం సందేశము అందించిన వారెవరున్నారు. ఇస్లాం, పవిత్ర ఖుర్ఆన్ గొప్పతనమును ప్రస్తావించు ధైర్యము లేని వారే నూజుబిల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం లేదా అహ్మదియ్య జమాఅత్ పవిత్ర ఖుర్ఆన్‌ను అవమానిస్తున్నదని నిందిస్తారు. ముస్లిమేతరులు పవిత్ర ఖుర్ఆన్ గొప్పతనమును ఖండించ లేక వీరి పనులను చూసి ఇస్లాం వ్యతిరేకతలో ఎంతగా అంధులైనారనగా తమ ఆత్మ సంతృప్తి కొరకు పవిత్ర ఖుర్ఆన్ పుటలను కాల్చి తమ కడుపు మంట చల్లార్చుకుంటున్నారు. ఉదాహరణకు స్వీడన్, స్కాండినేవియన్ (Scandinavian) దేశములలో ఇటువంటి సంఘటనలు సంభవించాయి. ముస్లిములు ఈ కాలపు ఇమామ్‌ను నమ్మి, పవిత్ర ఖుర్ఆన్ బోధనను అర్థము చేసుకొని దానిని ఆచరించినచో ఈ విధంగా పవిత్ర ఖుర్ఆన్‌ను కించపరుచుటకు ఈ ముస్లిమేతరులు ఎన్నడు సాహసించలేరు. అల్లాహ్

తఆలాయే వీరికి సద్బుద్ధి ప్రసాదించుగాక!

ఇప్పుడు పవిత్ర ఖుర్‌ఆన్ మాత్రమే సన్మార్గమునకు మార్గమని తెలుపుతు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు పేర్కొనిరి. ఇస్లాం ఎంతటి శుభకరమైన, దైవస్వరూప ధర్మమనగా ఎవరైనా సహృదయముతో క్రమం తప్పకుండా దేవుని పవిత్ర శాసనమైన పవిత్ర ఖుర్‌ఆన్‌లో సూచించబడిన దానిని ఆచరించినచో ఇహలోకములోనే దేవుణ్ణి దర్శించగలడు. ప్రపంచ దృష్టి నుండి వేలాది తెరల వెనుక ఉన్న దేవుణ్ణి గుర్తించుటకు ఖుర్‌ఆన్ బోధన తప్ప మరొకటి లేదు. పవిత్ర ఖుర్‌ఆన్ తెలివి తేటలు, ఆకాశ సంకేతముల ఆధారంగా అతి సులభమైన, సాధారణ పద్ధతిలో అల్లాహ్ తఆలా గురించి మార్గదర్శము చేయును. ఇందులో ఒక శుభము, ఆకర్షణీయ శక్తి గలదు. అది దేవుని అన్వేషకుణ్ణి క్షణ క్షణం దేవుని వైపు మళ్లించును, కాంతి, శాంతి, సంతృప్తిని ప్రసాదించును. పవిత్ర ఖుర్‌ఆన్‌ను మంచిగా నమ్మినవాడు తత్వజ్ఞానుల వలె ఈ వివేకవంతమైన ప్రపంచమునకు ఒక సృష్టికర్త ఉండవలెనని అనుటయే కాక స్వీయ అనుభవము పొంది, నమ్మక దృష్టితో చూచి వాస్తవముగా సృష్టికర్త ఉన్నాడని చెప్పగలడు. ఈ పవిత్ర శాసనముతో జ్యోతిని పొందినవాడు కేవలం బుద్ధితో సాటిలేని దేవుడు ఉన్నాడని నమ్మడమే కాక తన చెయ్యి పట్టుకొని నడిపించు ప్రకాశిస్తున్న వందలాది సంకేతములతో దేవుణ్ణి దర్శించుకొని వాస్తవముగా దేవునికి ఉనికి పరంగా, గుణముల పరంగా ఎవరు సమానంగా లేరని గుర్తించును. ఇంతేకాక ఆచరణ పరంగాను ఇటువంటి దేవుణ్ణి తాను నమ్ముతున్నానని ప్రపంచానికి చూపించును. దైవ ఏకత్వ వైభవము అతని హృదయములో ఎంతగా నాటుకుపోవుననగా అతడు మొత్తం ప్రపంచమును ఒక నిర్జీవ కీటకముగా లేదా ఉనికి రహితముగా లేదా శూన్యముగా భావించును.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో గల జ్ఞాన, ఆచరణ రీత్యా పరిపూర్ణ మార్గదర్శనము గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. పవిత్ర ఖుర్‌ఆన్‌లో జ్ఞాన, ఆచరణ రీత్యా పరిపూర్ణ మార్గదర్శనము గలదని గుర్తుంచుకోవలెను. اِهۡدِنَا الصِّرَاطَ లో జ్ఞాన సంపూర్ణత గురించి సంజ్ఞ గలదు. ఆచరణ పరిపూర్ణత ప్రస్తావన صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡہِمۡ లో గలదు. ఇట్లనిరి. పరిపూర్ణత, సంపూర్ణత ఫలితములను పొందవలెను. ఆచరణ అభివృద్ధి కొరకు వరములు పొందిన అనగా సందేశహరులు, సత్యమూర్తులు, అమరులు, బుద్ధిమంతులు వారి అడుగుజాడలను అనుసరించవలెను. ఇలాగే వారి ఉదాహరణలు కూడ ఉన్నాయి. ఈ కాలములో కూడ సన్మార్గము పొందినవారున్నారు. వారిని అల్లాహ్ తఆలా బహుమానములతో సత్కరిస్తున్నాడు. ఉదా॥ ఒక మొక్క నాటబడిన తర్వాత అది పెరిగి పెద్దకానంత వరకు పువ్వులు, ఫలములను పండించలేదు. ఇలాగే సన్మార్గ ఉన్నత, పరిపూర్ణ ఫలములను అందించని సన్మార్గము ప్రాణరహిత సన్మార్గమే. పవిత్ర ఖుర్‌ఆన్ ఎటువంటి సన్మార్గమనగా దానిని ఆచరించు వ్యక్తి ఉన్నత దశ విశిష్టతలను అందుకొనును. అల్లాహ్ తఆలాతో అతనికి నిజమైన అనుబంధము ఏర్పడడం మొదలగును. తద్వారా అతని సత్కర్మలే ఒక పవిత్ర వృక్షము వలె పువ్వులు, ఫలములను అందించును.

పవిత్ర ఖుర్‌ఆన్ ఎంతటి పవిత్రమైన పుస్తకమనగా ప్రపంచములో ఘోరాతి ఘోరమైన పీడనములు వ్యాపించి ఉండెను. అనేక చెడు విశ్వాసములు, దుష్కర్మలు ఆచరించబడుతుండెను. ఇదే విషయమును తెలుపుతు అల్లాహ్ తఆలా ఇట్లు సంజ్ఞ చేసెను. ظَهَرَ الْفَسَادُ فِي الْبَرِّ وَالْبَحْرِ అనగా గ్రంథములు గల మతస్తులతో

పాటు ఇతరులందరు చెడు విశ్వాసములలో నిమగ్నమై ఉన్నారు. ప్రపంచములో ఘోరమైన అశాంతి తలెత్తెను. అందుకే బూటకపు విశ్వాసములను ఖండించుటకు, మన మార్గదర్శనము కొరకు అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్ వంటి సంపూర్ణ గ్రంథమును పంపెను. ప్రత్యేకంగా ఫాతిహా అధ్యాయము. ఇది ప్రతి రోజు ఐదు పూటల నమాజులో ప్రతి రకాతులో చదవబడును. సూచనప్రాయంగా మొత్తం విశ్వాసముల ప్రస్తావన ఇందులో గలదు. ఇట్లనెను. الحمد للہ رب العالمین అనగా సకల సంకీర్తనములు ఆ సకల లోకాల సంరక్షకునికే చెందును. الرحمن అనగా కర్మల కంటే ముందే పుట్టించువాడు, ఏ పని చేయకున్నా వరించువాడు. الرحیم అనగా చేసిన పనులకు ఫలములను అందించువాడు, దుఆలను ఆమోదించువాడు. అతడు مالک یوم الدین అనగా తీర్పు దినమున యజమాని అతడే. పూర్తి శ్రద్ధతో మానవుడు ఐదు పూటల నమాజులలో ఇలా చదివినచో ఎంతో జ్ఞానము పొందవచ్చును.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పవిత్ర ఖుర్ఆన్ ఒక మహిమ. ప్రత్యర్థి పోటీగా ఎటువంటి ఉదాహరణ చూపక విఫలమైనప్పుడే అది మహిమ అనబడును. పవిత్ర ఖుర్ఆన్ మహిమ అరబ్ నివాసులందరి సమక్షములో ప్రదర్శించబడెను. కాని అరబ్ నివాసులందరు దానికి సమాన ఉదాహరణ చూపలేకపోయిరి. కావున మహిమ వాస్తవికతను అర్థము చేసుకొనుటకు పవిత్ర ఖుర్ఆన్ శాసనము ఎంతో జ్యోతిమయ ఉదాహరణ. దీని శాసనము ఎంతో సాహిత్యపరమైనది. ఇదెంతటి సాటిలేని మహిమ అనగా పదమూడు వందల సంవత్సరములు గడిచినను ఇప్పటికి ఎవరు దీనిని ఎదురించలేక పోయిరి. దీనిని ఎదురించి శక్తి ఎవరికి లేదు. ఇది మహిమాన్విత భవిష్యవాణీలను సైతం అద్భుత సాహిత్యములో వెల్లడించును. మహిమ అసలు గొప్ప ఉద్దేశము సత్యము అసత్యము లేదా సత్యవంతుని అతస్యునిలో భేదమును ప్రదర్శించుటయే. దైవ ఉనికి గుర్తింపుయే ధర్మపు అసలు సత్యము. దైవ ఉనికికి ఖచ్చితమైన, నమ్మకమైన సంకేతలమును ప్రవేశపెట్టుట నిజమైన ధర్మమునకు అనివార్యము.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. దేవుని ఉనికిని తెలుపలేని మతము నిర్జీవ మతమే. దాని ద్వారా ఎవరికి పవిత్ర మార్పు కలుగదు. ఇట్లనిరి. ఆ గ్రంథములో వ్రాసిన వివేకవంతమైన విషయములు నిజంగానే దవవాణి అని ఎవరు తీర్పు చెప్పగలరు. దైవ ఉనికి గురించి ఎప్పుడు నిదర్శన ములను చూపగలదు. ఆ వివేకవంతమైన విషయములు నిశ్చయంగా దేవుని సూక్తులని ఒక సత్యాన్వేషుని ఆత్మకు సంతృప్తి ఎలా కలుగును. ఆ విషయములన్నియు లోపరహితములైనవని ఎలా తృప్తి కలుగును. ఒక ధర్మము కొన్ని విషయములను బుద్ధి లేదా తత్వము పేరున తన సత్య కారణమని ప్రస్తావించి, ఆకాశ సంకేతములు, మహిమలను చూపుటలో విఫలమైనచో ఆ మతాచారుడు మోసమునకు గురైనట్లగును. అతడు అంధకారములో మరణించును. దైవ ఉనికిని నిశ్చయ రూపంలో నిరూపించి చూపనంత వరకు ఆ మతము శూన్యమే.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ స్థాయికి చేరుకొనుటకు మనము కృషి చేయవలెను. దేవుణ్ణి సంకేతములతో, స్వీయ అనుబంధముతో గుర్తించండి. అప్పుడు అల్లాహ్ తఆలా యదార్థము మానవునికి తెలియును. అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదియ్యా జమాఅత్‌లో ఇటువంటి ఉదాహరణలు గలవు. మతమును నమ్మని లేదా దేవుణ్ణి నమ్మని వారికి కూడ దైవ ఉనికి గురించి నమ్మకము కలిగించ

బడెను. వివేక నిదర్శనములు ఇవ్వబడెను. సంకేతములు చూపించి, సంఘటనలు ప్రస్తావించిన తర్వాత వారు మతమును కూడ నమ్మినారు, ఇస్లాంను కూడ విశ్వసించారు. బెల్జియంలోని నాస్తికులైన ఒక మిత్రులు బైఅత్ చేసిన తర్వాత ఇట్లు తెలిపిరి. నేను దేవుని ఉనికిని అంగీకరించినప్పుడు అహ్మదియ్యత్ అనగా స్వచ్ఛమైన ఇస్లాంను స్వీకరించక మరో మార్గము మిగల లేదు. ఈ మార్గము నాకు అహ్మదియ్యత్ చూపినందున నేను అహ్మదీ ముస్లింగా మారాను. విచారము! మన వ్యతిరేకులు ఈ విజ్ఞాన విషయములను వినుటకు సిద్ధముగా లేరు. పైగా మనము పవిత్ర ఖుర్ఆన్‌లో మార్పులకు పాల్పడుతున్నామని మనపై నిందలు మోపుతున్నారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పవిత్ర ఖుర్ఆన్ ప్రతి కథను పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు, ఇస్లాం కొరకు ఒక భవిష్యవాణిగా నిర్ణయించెను. ఈ కథల భవిష్యవాణీలు సైతం ఎంతో అద్భుతంగా పూర్తి అయినవి. సారాంశమేమనగా పవిత్ర ఖుర్ఆన్ విజ్ఞాన, వాస్తముల ఒక నది, భవిష్యవాణీల ఒక సుముద్రము. పవిత్ర ఖుర్ఆన్‌ను విడిచి అల్లాహ్ తఆలాపై ఎవరికైనా నమ్మకము కలుగుట అసాధ్యము. మానవులకు దేవునికి మధ్య ఉన్న తెరలు తొలగి పోవు ప్రత్యేకత పవిత్ర ఖుర్ఆన్‌లోనే గలదు. పవిత్ర ఖుర్ఆన్‌లో రెండు భాగాలు గలవు. ఒకటి కథలు రెండవది ఆదేశములు. ఒక విషయమును కథల రూపంలో తెలుపును కొన్ని ఆదేశములు మార్గదర్శన రూపంలో ఉండును. ఈ విషయమును గ్రహించలేని ప్రజలు పవిత్ర ఖుర్ఆన్‌లో విభేదమును నిరూపించు టకు కారకులవుతారు.

ఈ ఆంశము ఇంకా కొనసాగును. ఇంకా వారి (అ) ఉపదేశములు మిగిలి వున్నవి. అప్పుడప్పుడు ప్రస్తావింతును. పవిత్ర ఖుర్ఆన్ బోధనను నిజమైన రీతిలో ఆచరించుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! ఆమీన్.

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ وَنَشْھَدُ اَنْ لَّا اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*